మల్లన్న ఆలయ ధర్మకర్తల మండలి

నియామకానికి రీ-నోటిఫికేషన్

- ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- గత మార్చిలోనే నోటిఫికేషన్ విడుదల
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రక్రియ

7 లో



డొంక కదిలేనా!

- గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయా?
- లబ్ధిదారుల వివరాల ఆధారంగా విచారణ
- అధికారులు, దళారుల పాత్రపై ఆరా
- జిల్లాలో 17వేల మందికి మంజూరు
- 'గొర్రెల స్కీం'పై క్షేత్రస్థాయి పరిశీలన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 15 : గొల్లకుర్మల ఆర్థిక సాధికారతకు గత ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంపై తాజా ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఇందులో అధికారులు, దళారులు చేతివాటం ప్రదర్శించారని, గొర్రెల రీసైక్లింగ్ ద్వారా ఈ పథకం నిర్వీర్యమైందనే ఆరోపణలు ఉన్నాయి. మెజారిటీ శాతం గొల్లకుర్మల వద్ద గొర్రెలు లేవని.. పంపిణీ చేసినట్లే చేసి ఎంతోకొంత డబ్బు ముట్టజెప్పి 'గొర్రెల గోల్‌మాల్‌కు కారణమయ్యారనే కోణంలో ఈ విచారణ సాగుతున్నట్లుగా తెలుస్తోంది. గత జనవరిలోనే మొదలైన ఈ పరిశీలన .. ప్రస్తుతం క్షేత్రస్థాయికి చేరుతోంది. ఈ క్రమంలోనే జిల్లాకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలపై నివేదిక కోరినట్లుగా సమాచారం.

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 36,220 గొల్లకుర్మ కుటుంబాలు ఉన్నట్లుగా గత ప్రభుత్వం గుర్తించింది. సొసైటీల్లో సభ్యులుగా ఉన్నవారందరినీ గొర్రెల పంపిణీ పథకానికి అర్హులుగా తేల్చారు. ప్రతీ సభ్యుడికి 20 గొర్రెలు, ఒక గొర్రె పొట్టేలును ఒక యూనిట్‌గా సబ్సిడీ ద్వారా ఇవ్వడానికి నాటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలి దశలో 15,720 మందికి, రెండవ విడతలో 16,900 మందికి గొర్రెల యూనిట్లను మంజూరు చేసేలా చర్యలు చేపట్టింది. ఈ పథకానికి అప్పటి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఇదే జిల్లాలోని కొండపాకలో శ్రీకారం చుట్టారు. తన చేతులతోనే ఐదుగురు లబ్ధిదారులకు స్వయంగా గొర్రెలను పంపిణీ చేశారు. ఆ తర్వాత రాష్ట్రమంతటా ఉత్సాహంగా ఈ పథకాన్ని ఆచరణలోకి తెచ్చారు.

తొలివిడతలో ఆరోపణలు

తొలివిడతలో 15,720 మంది గొల్లకుర్మ సభ్యులకు గొర్రెలను పంపిణీ చేయడానికి గత ప్రభుత్వం తలపెట్టింది. 25 శాతం అంటే రూ.31,250 నగదు చెల్లించి డీడీలు కట్టినవారికి రూ.1.25లక్షల విలువైన 21 గొర్రెల యూనిట్‌ను పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి గొర్రెలు కొనుగోలు చేయడానికి ఆనాడు పశువైద్యాధికారులు, లబ్ధిదారులు వెళ్లారు. కానీ అక్కడ గొర్రెలు కొనుగోలు చేసి తీసుకొచ్చిన మరుసటి రోజే దళారులు ప్రవేశించి తక్కువ ధరకు లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేసిన పరిస్థితి దాపురించింది. ఇదంతా పలువురు అధికారుల దృష్టికి వచ్చినా చూసీచూడనట్లుగా వ్యవహరించారు. ఇందుకుగాను వారికి ముట్టాల్సిన పైకం ముట్టిందనే ఆరోపణలున్నాయి. ఆంధ్రా గొర్రెలు సిద్దిపేటకు, మళ్లీ సిద్దిపేట నుంచి ఆంధ్రాకు, తర్వాత అక్కడి నుండి ఇక్కడకు ఇలా నిత్యం రీసైక్లింగ్ చేస్తూ దళారులు పెద్దఎత్తున గొర్రెల దందా చేశారు. గొల్లకుర్మ కుటుంబాల్లో వృత్తికి దూరంగా ఉన్నవారందరినీ టార్గెట్ చేస్తూ వారికి సంబంధించిన గొర్రెలను తక్కువ ధరకు కొనుగోలు చేశారు. లబ్ధిదారులు చెల్లించిన రూ.31,250 నగదుకు రెట్టింపు నగదు ఇచ్చి మిగితా డబ్బును దళారులు, అధికారులు పంచుకున్నారనే ఆరోపణలు ఆనాడు వెల్లువెత్తాయి. ప్రస్తుతం తొలి విడత లబ్ధిదారుల ఇళ్లలో సగానికి పైగానే ఈ గొర్రెలు లేనట్లుగా అంచనా వేస్తున్నారు.

రెండో విడతలో ప్రక్షాళన

తొలివిడత గొర్రెల పంపిణీపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తడంతో రెండవ విడత గొర్రెల పంపిణీని పకడ్బందీగా చేపట్టే ప్రయత్నం చేశారు. అయితే గొర్రెల ధరలు పెరగడంతో ఈసారి లబ్ధిదారులు తమ వాటాగా 25శాతం రూ.43,750 చెల్లించాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం రూ.1.75లక్షల విలువైన గొర్రెల యూనిట్‌ను అందజేయాలని భావించింది. రెండో విడత కోసం ఎదురుచూసిన 16,900 మంది గొల్లకుర్మ సభ్యులకు అవగాహన కల్పించినప్పటికీ ఆసక్తి చూపించలేకపోయారు. లబ్ధిదారుల వాటా నగదు పెరగడంతో మరికొందరు వెనుకంజ వేశారు. ఫలితంగా కేవలం 6,582 మంది మాత్రమే డీడీలు చెల్లించగా సుమారు 1200 మందికే గొర్రెలు దక్కాయి. ఇంకా 5వేల పైచిలుకు మంది సభ్యులు గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారు. రెండవ విడతలో వెటర్నరీ అధికారులను కాకుండా ఇతర శాఖల అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో గొర్రెల కొనుగోలుకు పంపించారు. వీరిలో కూడా కొందరు ప్రబుద్ధులు అక్కడి ఏజెంట్లతో సంబంధాలు నెరిపి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. రెండో విడతలోనూ పలుచోట్ల గొర్రెల రీసైక్లింగ్ జరిగిందనే అనుమానాలు ఉన్నాయి.

లబ్ధిదారుల వివరాలు సేకరణ

తాజాగా గొర్రెల స్కీం హాట్‌టాపిక్‌గా మారింది. ఇందులో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సిద్దిపేట జిల్లాలోనూ ఈ పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారులకూ ఫిర్యాదు చేశారు. కాగా ఈ పథకానికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు. మొదటి, రెండో విడతల్లో గొర్రెలు అందుకున్న లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో విచారించడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ జిల్లాకు గొర్రెలను సరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరించిన కొందరు ఆంధ్రా ఏజెంట్లపై కూడా ఆరా తీస్తున్నారు. వీరికి అనుకూలంగా ఉన్న జిల్లాలోని అధికారుల బండారం కూడా బయటపడనున్నది. నాటి ప్రభుత్వం సదుద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టగా దళారులు, అధికారుల ప్రమేయం వల్ల అభాసుపాలైంది.

నిర్వాసితులను ఆదుకుంటాం

- కలెక్టర్ మనుచౌదరి

ములుగు, జూన్ 15: కొండపోచమ్మ నిర్వాసితులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శనివారం ములుగు మండలంలోని కొండపోచమ్మ జలాశయాన్ని పరిశీలించారు. అనంతరం ములుగు మండలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొండపోచమ్మ నిర్వాసిత మామిడ్యాల పునరావాస కాలనీని ఆయన సందర్శించి తాత్కాలికంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమకు ఇంకా ప్లాట్లు కేటాయించలేదని, ప్రస్తుతం ఉంటున్న తాత్కాలిక ఇళ్లు వర్షానికి ఉరుస్తున్నాయని, గాలికి పైకప్పులు ఎగిరిపోయాయని తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరా కూడా సరిగా ఉండడం లేదని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ పునరావాస కేంద్రం వద్ద ప్రధాన రహదారికి దగ్గర్లో ఉన్న ప్రభుత్వ స్థలంలో లేఅవుట్ చేసి మామిడ్యాల గ్రామానికి చెందిన 37 కుటుంబాలతో పాటు ఇతర గ్రామాలకు చెందిన నిర్వాసితులకు ఉపయోగపడేలా వంద ప్లాట్లను సిద్ధం చేయాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ములుగు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట కొండ పోచమ్మ ఎస్ఈ వేణు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తమ్మలి శ్రీనివాస్, రాజకుమార్‌తోపాటు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



కొండపాకలోని రుద్రేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్

కొండపాక రుద్రేశ్వరాలయాన్ని సందర్శించిన కలెక్టర్

కొండపాక : మండల కేంద్రంలో గల రుద్రేశ్వరాలయాన్ని కలెక్టర్ మను చౌదరి శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు ప్రతినిధులు వెంకటరమణ శర్మ, అనంతుల శ్యాంమోహన్ ఆధ్వర్యంలో పూజారులు కలెక్టర్‌కు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయ విశిష్టతను, చరిత్రను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ గ్రామంలో నిర్మాణంలో గల రహదారి వెడల్పు పనులను పరిశీలించి మాట్లాడారు. ఎంతో చరిత్ర, విశిష్టత కలిగిన కొండపాక రుద్రేశ్వరాలయంలో పూజలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి, నిర్మాణంలో ఉన్న రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు, గ్రామాభివృద్ధికి జిల్లా అధికార యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు, మాజీ సర్పంచ్ చిట్టి మాధురి, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతల ప్రశాంత్, మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య, ఆలయ ట్రస్ట్ డైరెక్టర్ రేణిగింది బాలయ్య, పీసీసీ సభ్యుడు గంప మహేందర్ తదితరులు ఉన్నారు.



మామిడ్యాలలో నిర్వాసితుల ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

విద్యార్థి సంఘాలు బలవంతంగా

స్కూల్స్ బంద్ చేయకూడదు : సీపీ

సిద్దిపేట క్రైం, జూన్ 15: జిల్లాలోని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎవరు కూడా చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుని బలవంతంగా స్కూల్స్ బంద్ చేయించడం, స్కూల్స్‌కు వెళ్లి విద్యార్థులకు ఇబ్బంది కలిగించడం వంటి కార్యక్రమాలు చేపట్టకూడదని సీపీ అనురాధ శనివారం ప్రకటనలో తెలిపారు. పిల్లల తరఫున స్కూల్ సమస్యలుంటే విద్యార్థి సంఘాల నాయకులు, డీఈవో లేదా సంబంధితశాఖ అధికారులకు, లేదంటే కలెక్టర్‌ను కలిసి వివరించాలన్నారు. ఆయా సమస్యలపై స్కూళ్ల యాజమాన్యాలతో మాట్లాడి పరిష్కరిస్తారని తెలిపారు. అలాకాకుండా విద్యార్థి సంఘాల నాయకులు స్కూల్స్ ఎదుట ధర్నా, రాస్తారోకోలు చేసి విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



విద్యార్థులే స్వీపర్లు!

మద్దూరు మండలంలోని పలుపాఠశాలల్లో స్వీపర్లు చేసే పనిని విద్యార్థులతో చేయించాల్సిన దుస్థితి నెలకొన్నది. ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం నాటికి స్కూళ్ల పరిసరాలతో పాటు గదులను స్వీపర్లతో శుభ్రం చేయించాలి. కానీ, పాఠశాలల్లో స్వీపర్లతో పాటుగా స్కావెంజర్లు లేకపోవడంతో విద్యార్థులే గదులను శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

- మద్దూరు

మాటూర్ చక్కెర కర్మాగారం

క్రషింగ్‌కు సిద్ధం చేసేలా కృషి

- డిప్యూటీ కేన్ కమిషనర్ నర్సిరెడ్డి

జహీరాబాద్, జూన్15: రాయికోడ్ మండలంలోని మాటూర్‌లో నిర్మితమవుతున్న చక్కెర కర్మాగారం ఈ ఏడాది క్రషింగ్‌కు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని డిప్యూటీ కేన్ కమిషనర్ నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు పట్టణంలోని సీడీసీ కార్యాలయంలో చెరకు రైతులతో నిర్మించిన సమావేశంలో మాట్లాడారు. మాటూర్‌లో నిర్మిస్తున్న చక్కెర పరిశ్రమ పనులను పరిశీలించామన్నారు. నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నామని, నవంబర్‌లో నాటికి సిద్ధమవుతుందని తెలిపారు. జహీరాబాద్‌లో ట్రైడెంట్ చక్కెర కర్మాగారం మూతపడడంతో నియోజకవర్గ పరిధిలోని రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. రాయికోడ్‌లో చక్కెర కర్మాగారంతో ఇక్కడ చెరకు రైతుల సమస్యలకు కొంతమేరకు పరిష్కారం లభిస్తుందన్నారు. జహీరాబాద్ ప్రాంత రైతులు ఈ కర్మాగారానికి చెరకును తరలించడంపై అధికారులు అభిప్రాయాలను సేకరించారు. చెరకు పంటను పొలాల్లో నుంచి రూపుచేయడానికి కూలీలను ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను కోరారు. వీలును బట్టి అందుబాటులో ఉన్న కర్మాగారాలకు పంటను తరలించుకుంటామని పలువురు రైతులు వివరించారు. సమావేశంలో బోధన్, సంగారెడ్డి అసిస్టెంట్ కేన్ కమిషనర్ వెంకటరవి, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పచ్చని రంగేసినట్టు..

ఈ ఫొటోలను చూస్తుంటే పచ్చని పైరు.. ఆ పైరులో కొన్ని పక్షులు క్రిమికీటకాలను తింటున్నాయనుకుంటే పొరబడినట్లే. ఎందుకంటే ఇది పైరు కాదు..చెరువు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న చింతల్ చెరువులో గుర్రపుడెక్క ఇదంతా.. నిండుకుండలా దర్శనమివ్వాల్సిన చెరువు ఇలా పచ్చని రంగేసినట్లు కనిపిస్తుంది.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్





ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

● ఉన్నత విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. రాజేందర్‌సింగ్



కళాశాలలోని పరిశోధన శాలను పరిశీలిస్తున్న రాజేందర్‌సింగ్

గజ్వేల్, జూన్ 15: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. రాజేందర్‌సింగ్ పేర్కొన్నారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని, ప్రభుత్వ కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు దోస్త్ ద్వారా అడ్మిషన్స్ పొంది, తగిన కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో మళ్లీ కో-ఎడ్యుకేషన్ ప్రారంభమైందని తెలిపారు. ఆయనవెంట ఆడిట్ అధికారులు దీపక్‌కుమార్, ముఖేష్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ గణపతిరావు, అధ్యాపకులు ఎస్.రమేశ్‌బాబు, బాలరాజు, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రం, పెద్దిరాజు, కవిత, లక్ష్మీనరసయ్య, మార్కండేయ, ఓం ప్రకాశ్, విష్ణుమూర్తి ఉన్నారు.

రాశి సీడ్స్ కంపెనీ భారీ మోసం

- రైతులకు విత్తనోత్పత్తి విత్తనాల సరఫరా
- పంట దిగుబడి రాకపోతే నష్టపరిహారం చెల్లిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన సీడ్స్ ఆర్గనైజర్
- పంట దిగుబడి రాకపోవడంతో చేతులెత్తేసిన వైనం
- ఆందోళనలో రైతులు




సాగుచేసిన ఆడ, మగ వరి పంట (ఫైల్), అక్కన్నపేటలో ఆర్గనైజర్ రాసిచ్చిన బాండ్ పేపర్, విత్తనాల బ్యాగులను చూపుతున్న రైతులు

అక్కన్నపేట, జూన్ 15: గ్రామాల్లోని రైతులను టార్గెట్ చేస్తూ.. మాయ మాటలు చెప్పి దిగుబడి రాకపోతే నష్టపరిహారం చెల్లిస్తానంటూ బాండ్ పేపర్ సైతం రాసిచ్చిన సీడ్స్ ఆర్గనైజర్.. రైతులు సాగుచేసిన వరి విత్తనోత్పత్తి పంట దిగుబడి రాకపోవడంతో చేతులెత్తేశాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకున్నది. వరి విత్తనోత్పత్తి పంట సాగుచేసిన రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్న బదనాపురం మొగిలి సీడ్స్ ఆర్గనైజర్‌గా పలు గ్రామాల్లో రైతులకు వరి విత్తనోత్పత్తి, మొక్కజొన్న విత్తనాలను సరఫరా చేశాడు. ఇందులో భాగంగా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన రైతులతో సమావేశమయ్యాడు. రాశి సీడ్స్ కంపెనీకి చెందిన టీపీఆర్‌ఎచ్ 3-23ఆర్‌ఎస్ అనే వెరైటీ గల ఆడ, మగ వరి విత్తనాలను సాగుచేయాలని, ఎకరానికి 15 క్వింటాళ్లపైన దిగుబడి వస్తుందని చెప్పాడు. క్వింటాల్‌కు ధర రూ.5,800 చెల్లిస్తామని, ఒకవేళ పంట దిగుబడి రాకపోతే ఎకరానికి 15 క్వింటాళ్ల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తానని బాండ్ పేపర్ సైతం రాసిచ్చాడు. దీంతో రైతులు ఆడ, మగ వరి పంట సాగుచేశారు. ఆర్గనైజర్‌తో పాటు రాశి సీడ్స్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు చెప్పిన విధంగా పంటకు పెస్టిసైడ్స్, ఎరువులు వేశామని, పంటలో బెరుకులు వస్తే కూడా తీసి వేశామని చెప్పారు. తీరా పంట హార్వెస్టింగ్ చేసిన తర్వాత ఆర్గనైజర్ చెప్పిన విధంగా దిగుబడి రాలేదు. ఎకరానికి 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. సరే బాండ్ పేపర్ రాసిచ్చాడు కదా అని నమ్మిన రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్గనైజర్‌కు విక్రయించారు. తీరా ఇప్పుడు ఆర్గనైజర్ బాండ్ పేపర్ ప్రకారం కాకుండా రైతులు పండించిన ధాన్యానికి మాత్రమే డబ్బులు చెల్లిస్తానని చెపుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మీరు రాసిచ్చిన బాండ్ పేపర్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఆర్గనైజర్‌ను రైతులు అడగడంతో 'నేను ఇవ్వను.. ఏం చేసుకుంటారో చేసుకోండి... ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి..' అంటూ దురుసుగా మాట్లాడుతున్నారని రైతులు వాపోయారు. 'నేను చెప్పింది వినక ఒకవేళ మీడియాకు చెప్పి పేపర్‌లో వస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వను.. ఇక మీ ఇష్టం అంటూ బెదిరిస్తున్నాడు' అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసులకు, వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వారు స్పందించి సీడ్స్ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రూ.లక్ష పెట్టుబడితో సాగు చేశాను



3 ఎకరాల్లో ఆడ, మగ వరి పంటను సాగుచేశాను. కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు, ఆర్గనైజర్ చెప్పిన విధంగా మందులు, ఎరువులు వేశాను. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. ఆర్గనైజర్ చెప్పిన విధంగా దిగుమతి రాలేదు. బాండ్ పేపర్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని అడిగితే ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. అధికారులు స్పందించి ఆర్గనైజర్ పై చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇప్పించాలి.

- మిట్టపల్లి శంకర్, రైతు, అక్కన్నపేట

దిగుబడి వస్తే అప్పులు తీర్చాలనుకున్న



మూడు ఎకరాల్లో ఆడ, మగ వరి పంటను సాగుచేశాను. పెట్టుబడికి కూడా భయపడకుండా రూ.లక్ష వరకు అప్పులు తెచ్చి పెట్టాను. పంట దిగుబడి బాగా వస్తే చెల్లెలి పెళ్లికి చేసిన అప్పులు తీర్చాలనుకున్న. తీరా చూస్తే పంట దిగుబడి రాలేదు. అప్పులు మిగిలాయి. నష్టపరిహారం ఇవ్వాలని ఆర్గనైజర్‌ను అడిగితే నేను ఇచ్చినంత తీసుకోవాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

- పోలు సురేష్, రైతు, అక్కన్నపేట

బాబోయ్.. అంగడిలో దొంగలు

- ప్రతీ శుక్రవారం 10 వరకు సెల్‌ఫోన్ల చోరీ..
- అంగడికి రావాలంటే జంకుతున్న సెల్ వినియోగదారులు
- పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు

హుస్నాబాద్, జూన్ 15: హుస్నాబాద్ పట్టణంలో వార సంత జరిగే ప్రతి శుక్రవారం సెల్ ఫోన్ దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రతి వారం 5 నుంచి 10 వరకు సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్లో బాధితుల ఫిర్యాదులు వారవారం పెరిగిపోతున్నాయి. గడిచిన ఈ మూడు నాలుగు వారాల్లోనే అంగడిలో 30 వరకు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లు బాధితులు వాపోయారు. హుస్నాబాద్ పట్టణంలోని రామవరం రోడ్డు నుంచి అక్కన్నపేట మార్కెట్ రోడ్డులో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు విక్రయిస్తుంటారు. అంగడి రోజు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో ఈ రోడ్డు కిక్కిరిసిపోతుంది. సంతకు వచ్చిన వారు కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్న క్రమంలో ఒక ముఠా వారి పక్కనే ఉండి సెల్‌ఫోన్‌లు దొంగిలించి ఒకరి నుంచి మరొకరి ద్వారా బయటకు చేరవేస్తుంటారని తెలిసింది. అయితే ఈ చోరీకి పాల్పడే వారు మైనర్లు అనేది సమాచారం. ఈ సెల్‌ఫోన్ల చోరీలతో ప్రజలు అంగడికి రావాలంటే భయపడిపోతున్నారు. సంతలో ఇలాంటివి జరుగకుండా జాగ్రత్తలు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఈ చోరీలను కట్టడి చేసేందుకు అంగడి రోజు మైక్ ద్వారా అనౌన్స్ చేస్తే బాగుంటుందని, అదే కాకుండా పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత



పటాన్‌చెరులో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు

నర్సాపూర్/మనోరాబాద్, జూన్ 15: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి, అతని వద్ద రూ.50 వేల విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మనోరాబాద్ మండలంలో ఇండస్ట్రియల్ ప్రాంతంలో అక్రమంగా ఒడిస్సాకు చెందిన అక్షయ్‌నాయక్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టి అతని ఇంట్లో 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, నరేష్, హరీశ్, రవి పాల్గొన్నారు.

ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పటాన్‌చెరు రూరల్, జూన్ 15: ఎండు గంజాయి అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన శనివారం ఇస్నాపూర్ తేజ కాలనీలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసుల వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సాజిద్ ఇక్బాల్(34) ఎండు గంజాయి అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు మెదక్ డివిజన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అతడి ఇంటిపై దాడిచేసి 60 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం



మనోహర్(ఫైల్)

సంగారెడ్డి క్రైం, జూన్ 15: భార్యతో గొడవపడి భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకున్నది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎన్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.... పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన డప్పు మనోహర్(35) మిషన్ భగీరథలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 3న భార్య విజయలక్ష్మితో కుటుంబ విషయంలో గొడవపడ్డాడు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కాగా 10న భార్య ఫోన్‌చేయగా మనోహర్ మాట్లాడినప్పటికీ తర్వాత నుంచి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో భార్య తన భర్త ఆచూకీ తెలుసుకోవాలని కోరుతూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 08455 276333 లేదా 8712656718 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

మూడు ప్రైవేట్ పాఠశాలలకు షోకాజ్ నోటీసులు

- డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జూన్ 15: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం అమ్ముతూ, అధిక ట్యూషన్, అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్న మూడు ప్రైవేటు పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరులోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్, శిశు విహార్ స్కూల్, అమీన్‌పూర్‌లోని శ్రీనిధి గ్లోబల్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ఈ విషయం గమనించి నిబంధనలు పాటించాలని సూచించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే



పీచేర్యగడితండాలో సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి సందీప్

కోహీర్, జూన్ 15: మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నాలుగురోజులుగా కార్యదర్శులు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నీరు సరఫరా అవుతుందా..? ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలను తెలుసుకునేందుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఐదురోజులుగా వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. కోహీర్ మండలంలో 13,645 కుటుంబాలు ఉండగా.. సగానికి పైగా కుటుంబాలకు నల్లా కనెక్షన్ లేదని, నల్లా కనెక్షన్ ఉన్న చాలా ఇళ్లకు నీళ్లు రావడం లేదని తెలిసింది. నీరు సరఫరా అవుతున్న కుటుంబాల సభ్యులు మిషన్ భగీరథ నీళ్లు తాగడం లేదని, వాటిని కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నట్లు సర్వేలో గుర్తించారు.

అందెశ్రీ రాకతో రేబర్తిలో సందడి



ఉపాధ్యాయులతో అందెశ్రీ

మద్దూరు, జూన్ 15: జయజయహే తెలంగాణ జననీ జయ కేతనం అంటూ రాష్ట్ర గీతాన్ని అందించిన ప్రముఖ కవి సినీగేయ రచయిత అందెశ్రీ రాకతో శనివారం మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో సందడి నెలకొన్నది. జయజయహే గీతం రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ప్రకటించిన అనంతరం మొదటిసారిగా గ్రామాన్ని సందర్శించడంతో చిన్ననాటి స్నేహితులు, గ్రామస్థులు అందెశ్రీని ఆప్యాయంగా పలకరించి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలను చిన్ననాటి స్నేహితుడు శివయ్యతో కలిసి సందర్శించారు. ఉపాధ్యాయులతో కాసేపు ముచ్చటించారు. ఇంతమంది నాయకులున్నా దిక్కులేకుండా ఉన్న రేబర్తి పాఠశాల దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ చదువులమ్మ ఒడికి తనవంతుగా సాయమందించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఆయనవెంట హెచ్‌ఎంలు వరదరాజు, బస్వరాజు కనకయ్య, సెక్రటరీ మాదవ్‌జాదవ్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు. గ్రామంలో ఇటీవల తన చిన్ననాటి స్నేహితుడైన చిల్వారి భూపతిరెడ్డితో పాటు అందె యాదగిరి మృతి చెందారు. విషయం తెలుసుకున్న అందెశ్రీ శనివారం వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివయ్య, ఎర్రబచ్చల బాలమల్లు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఎండీ అలీమ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా కుటుంబ సర్వే

- మెదక్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మాజీ



కొల్చారంలో అంగన్‌వాడీ టీచర్ల సర్వేలో బ్రహ్మాజీ

కొల్చారం, జూన్ 15: అంగన్‌వాడీలో ప్రత్యేక యాప్ ద్వారా కుటుంబ సర్వే జరుగుతుందని... సర్వే పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని ఐసీడీఎస్ మెదక్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మాజీ తెలిపారు. మండల కేంద్రమైన కొల్చారంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. అనంతరం కొల్చారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కొల్చారం సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లకు సర్వేపై ప్రత్యేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మెదక్, రామాయంపేట, అల్లాదుర్గం, నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలో 1076 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో 32 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 62 అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక యాప్ ద్వారా కుటుంబ సర్వే జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని నమోదు చేస్తామని, దాంతో చిన్నారుల ఎత్తుకు దగ్గ బరువు ఉండేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఫ్రీ స్కూల్ బుక్స్, యూనిఫాంలు ప్రభుత్వం ఇస్తున్నదన్నారు. అంగన్‌వాడీలో పిల్లలను నమోదు చేసుకునేందుకు అంగన్‌వాడీ బాట, అలాగే ఐదేళ్లు పూర్తయిన వారిని పాఠశాలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డీసీసీబీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు

- స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాల పంపిణీ



మంత్రి దామోదర్ రాజనర్సింహను శాలువాతో సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్

సంగారెడ్డి టౌన్, జూన్ 15: ఉమ్మడి జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు ఇచ్చినందుకు డీసీసీబీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు హైదారబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి భవనంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీసీసీబీ సీఈవో శ్రీనివాస్ ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారంరాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అయితే ఉత్తమ అవార్డు పొందినందుకు డీసీసీబీ పాలకవర్గంతో పాటు అధికారులను మంత్రి అభినందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ ద్వారా 7,500 స్వయం సహాయక సంఘాలకు రూ.450 కోట్ల బ్యాంకు లింకేజి రుణాలను అందజేశారు. రాష్ట్రంలోని అన్ని డీసీసీబీ బ్యాంకులను పోలిస్తే సంగారెడ్డిలోని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీకి ఈ అవార్డు లభించింది. ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా డీసీసీబీ అధికారులు, ఉద్యోగులను చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అభినందించారు.

హత్నూర మహిళా సంఘానికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

హత్నూర, జూన్ 15: మండల కేంద్రమైన హత్నూర గ్రామైక్య సంఘానికి బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీలో రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కించుకున్నారు. 2023-24 సంవత్సరానికిగాను సెర్ప్ కార్యక్రమంలో బ్యాంక్ లింకేజీలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉత్తమ సంఘంగా ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రలో పంచాయతీరాజ్‌శాఖ ఈ అవార్డును హత్నూర గ్రామైక్య సంఘం బాధ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో అనితారామచంద్రన్, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కే.రాణి, కార్యదర్శి అపర్ణ, ఐకేపీ సీసీ మహేష్, వీవోఏ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను హత్యచేసిన కుమారుడికి రిమాండ్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నర్సాపూర్, జూన్ 15: అడిగిన డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తల్లిదండ్రులను హత్యచేసిన కొడుకును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ బి.వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ సీఐ కార్యాలయంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్లనగర్‌కు చెందిన చాకలి కిష్టయ్య(75), నర్సమ్మ(70) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమారులు. ఇందులో లక్ష్మణ్ చిన్నవాడు. బొంతపల్లిలో నివాసముంటూ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే తల్లిదండ్రులు గతేడాది క్రితం వారి పేరిట ఉన్న భూమి అమ్మగా వచ్చిన డబ్బులు ముగ్గురు కుమారులకు ఇచ్చి.. కొంత వారి వద్ద ఉంచుకున్నారు. అయితే లక్ష్మణ్ జల్సాలకు అలవాటు పడి అప్పుల పాలై.. డబ్బులు ఇవ్వాలంటూ తల్లిదండ్రులను తరచూ ఒత్తిడి చేయగా.. వారు నిరాకరించేవారు. వారిని చంపితేనే డబ్బులు వస్తాయన్న చెడు ఆలోచన అతనిలో కలిగింది. దీంతో మే 17న సాదుల్లనగర్‌లో ఉండే తల్లిదండ్రులను బొంతపల్లిలో అద్దెకు ఉండే ఇంటికి తీసుకువచ్చాడు. 18న చంపాలనుకున్నా సమయం కుదరలేదు. మే 19న తిరిగి తల్లిదండ్రులను డబ్బులు డిమాండ్ చేశాడు. అందుకు వారు తిరస్కరించడంతో గొడవపడ్డాడు. ఇదే అదునుగా భావించి తల్లిదండ్రులు పడుకున్న సమయంలో ఇద్దరి గొంతునులిమి చంపేసి అమ్మ మెడపై ఉన్న మూడుతులాల బంగారు నగలను తీసుకున్నాడు. అదేరాత్రి తన కారులో ఇద్దరి మృతదేహాలను నర్సాపూర్ సమీపంలోని చెరువు వద్ద నిర్మానుష్య ప్రాంతంలో పొదల్లో పడేశాడు. అనంతరం తనవెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి తగులబెట్టి వెళ్లిపోయాడు. జంట మృతదేహాలు పడి ఉన్న విషయం నర్సాపూర్ పోలీసులకు తెలియడంతో గుర్తుతెలియని వ్యక్తుల కింద సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సాదుల్లనగర్ గ్రామస్థులకు కిష్టయ్య, నర్సమ్మ కనిపించడకపోవడంతో పాటు వారి కొడుకు లక్ష్మణ్ తీరు అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు లక్ష్మణ్‌ను అదుపులో తీసుకుని విచారించగా.. తల్లిదండ్రులను తానే హత్యచేశానని ఒప్పుకోవడంతో శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన సిబ్బంది ఉపేందర్, శ్రీకాంత్, పోచయ్యలను డీఎస్పీ అభినందించారు.

అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

జహీరాబాద్, జూన్ 15: గ్రామాల్లో, పట్టణాల్లో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది కలిసి సమన్వయంతో పనిచేయాలని ఐసీడీఎస్ రీజినల్ డైరెక్టర్(ఆర్డేడీ) మోతి అన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్, రంజోల్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను, హెల్త్ సబ్ సెంటర్లను పరిశీలించి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్న పిల్లల నమోదు వివరాలను సక్రమంగా చేపట్టాలన్నారు. రికార్డులకు, ఆన్‌లైన్‌కు పొంతన ఉండేలా చూడాలని తెలిపారు. నమోదు సమయంలో ఇబ్బందులు ఏర్పడితే ఐసీడీఎస్ అధికారులను సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సునీత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చేర్యాలలో పట్టపగలే చైన్‌స్నాచింగ్

- మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ
- బైక్‌పై పరారైన నిందితులు



చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి బైక్‌పై పరారవుతున్న ఆగంతకులు

చేర్యాల, జూన్ 15: చేర్యాల పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించుకుని పరారయ్యారు. చేర్యాల మండలం కడవేరుగుకు చెందిన నరుకుల వీరమ్మ పట్టణ శివారులో నివసిస్తున్నది. శనివారం మధ్యాహ్నం స్థానిక హనుమాన్‌నగర్ కాలనీ సమీపంలోని తమ బంధువుల వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఇరువురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వెంబడించారు. జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి పక్కనగల వాసవీ గార్డెన్స్ మూలమలుపు వద్ద వీరమ్మ మెడలో నుంచి సుమారు మూడున్నర తులాల బంగారు గొలుసుకుని లాక్కుని ఉడాయించారు. ఆమె అరుపులు విన్న చుట్టుపక్కల వారు పట్టుకునేందుకు ప్రయత్నించగా ఆగంతకులు పరారయ్యారు. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలపడంతో చుట్టుపక్కలగల భవనాలలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. బైక్ నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ ధరించగా, వెనకల మరో యువకుడు ఉండటాన్ని గుర్తించారు. ఫుటేజీలలో బైక్ నంబర్‌ను గుర్తించడంతో దర్యాప్తు చేపట్టారు. పోలీసు సిబ్బంది రెండు బృందాలుగా వీడి ఆగంతకుల కోసం గాలిస్తున్నారు.

మల్లన్న ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి రీ-నోటిఫికేషన్

- ఈనెల 28 వరకు దరఖాస్తుకు అవకాశం
- గత మార్చిలోనే విడుదల
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రక్రియ
- మళ్లీ రీ-నోటిఫికేషన్ విడుదల



మల్లన్న ఆలయ రాజగోపురం

చేర్యాల, జూన్ 15 : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దేవాదాయశాఖ ఇటీవల రీ నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం జనవరిలో జరిగిన స్వామివారి కల్యాణానికి ముందు నాలుగు నెలల కాలపరిమితితో కూడిన పునరుద్ధరణ కమిటీని నియమించగా, గత మే 5వతేదీతో ఆ కాలపరిమితి ముగిసింది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల పాలకమండళ్ల నియామకానికి దేవాదాయశాఖ చర్యలు తీసుకుని గతమార్చి నెలలో నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ పార్లమెంటు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియను నిలిపివేసింది. ఈనెల మొదటివారంలో ఎన్నికల కోడ్ ముగిసిన క్రమంలో మళ్లీ నోటిఫికేషన్ వెలువరిచింది. ఈనెల 28వ తేదీలోగా ఆసక్తిగల వారు హైదరాబాద్ దేవాదాయశాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ మెదక్, సంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇదిలా ఉండగా, గత పునరుద్ధరణ కమిటీలో 20మందికి చోటు కల్పించిన క్రమంలో పలువురు ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారు. ఈనేపథ్యంలో కమిటీలో పలువురిని మార్చి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నకల్లో చిత్తశుద్ధిగా పనిచేసిన పలువురికి నూతనంగా అవకాశం కల్పించేందుకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే జాబితా రూపకల్పన జరిపి ప్రతిదించడంతో అధికారిక ప్రకటన వెలువడటమే తరువాయి అని సమాచారం. తమ తమ గాడ్‌ఫాదర్‌లతో పార్టీ అధిష్ఠాన నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో నియోజకవర్గ నేతలే ఖరారు చేసే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం పలువురు మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు దృష్టిసారించడం, మరో రెండువారాల పాటు సమయం ఉండటంతో కొద్దిరోజులక్రితం ప్రతిపాదించిన జాబితాలో స్వల్పమార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొన్నది. కాగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి సన్నిహితుడిగా మెదులుతున్న పర్యాటకం లక్ష్మారెడ్డికి మరోమారు ఛైర్మన్‌గా అవకాశం కల్పించనున్నట్లు ప్రచారం జరుగుతున్న క్రమంలో కమిటీలో ఎవరెవరికి చోటు కల్పించనున్నారని ఆసక్తికరంగా మారింది.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయ అధికారి మహేష్



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

నారాయణరావుపేట, జూన్ 15: జిల్లాలో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి మహేష్ హెచ్చరించారు. మండలంలోని పలు విత్తనాల దుకాణాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాల కొరత లేదని తెలిపారు. తనిఖీల్లో భాగంగా విత్తన దుకాణాల్లోని రిజిస్టర్లు, బిల్ బుక్కులను పరిశీలించారు. ఆయనవెంట టెక్నికల్ ఏవో శివరామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి వెంకట రమణి, ఏఈవో నాగార్జున్ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి

● రోడ్లకు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 15: ఎన్నికల వరకే పార్టీలుండాలని, ప్రజల సంక్షేమం కోసం పార్టీలకతీతంగా అంతా కలిసికట్టుగా పనిచేసి, దుబ్బాక అభివృద్ధికి పాటుపడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ పార్లమెంటు సభ్యులుగా గెలిచిన మాధవనేని రఘునందన్‌రావుకు తాను శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు ప్రకటించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన దుబ్బాక నియోజకవర్గస్థాయి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ విభాగానికి చెందిన 47 రహదారుల నిర్మాణం కోసం సుమారు 105 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ ద్వారా నిర్మాణం చేపట్టాల్సిన రహదారులకు సంబంధించి 200 కోట్లతో ప్రతిపాదనలను తయారు చేయాలని, తాను వీటిని ప్రభుత్వానికి పంపిస్తానని తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఎంపీ ల్యాండ్ నిధులతో జరుగుతున్న పనులపై కూడా సమీక్ష నిర్వహించారు. అంతేగాక దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని అసంపూర్తి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన డిగ్రీకళాశాల, మైనార్టీ వసతి గృహాలను సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఎస్ఈ జోగారెడ్డి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి, డీఈఈ విజయప్రకాష్, ఏఈలు రిజ్వాన్, రామకృష్ణారెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, జడ్పీటీసీ రవీందర్ రెడ్డి , వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఆలయంలో పూజలు

మిరుదొడ్డి, జూన్ 15: మండలంలోని మోతే గ్రామంలోని రామలింగేశ్వరాలయం 25వ వార్షికోత్సవంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్ రెడ్డి శనివారం పూజలు చేశారు. ఆయనను గ్రామ మాజీ సర్పంచు శ్రీనివాస్, సూకురి లింగం, సత్యనారాయణ సన్మానించారు.

అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య

దుబ్బాక, జూన్15: అనారోగ్య సమస్యలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన దుబ్బాక మున్సిపాలిటీలోని దుంపలపల్లి వార్డులో శనివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సంతోషా (30) అదే గ్రామానికి చెందిన నవనీత్‌రెడ్డిని ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నది. కొన్నాళ్లుగా సంతోషా మూర్ఛతో పాటు కడుపునొప్పితో తీవ్రంగా బాధపడుతున్నది. శనివారం గ్రామంలోని తన తల్లిగారింట్లో సంతోషా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. దుబ్బాక ఎస్ఐ గంగారాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పనికి వెళ్లిన మహిళ అదృశ్యం

గజ్వేల్, జూన్ 15: పనికి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన కూర నర్సమ్మ(45) ఇంట్లో శుక్రవారం ఉదయం కుటుంబసభ్యుల మధ్య గొడవ జరుగగా పనికి వెళ్లొస్తానని వెళ్లింది. సాయంత్రమైనా తిరిగిరాకపోవడంతో ఊరంతా వెతికిన కుటుంబసభ్యులు, శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.సైదా తెలిపారు.

ప్రశాంతంగా బక్రీద్ వేడుకలు జరుపుకోవాలి

● హుస్నాబాద్ ఏసీపీ సతీశ్



రసూలాబాద్‌లో విచారణ చేస్తున్న ఏసీపీ సతీశ్

చేర్యాల, జూన్ 15: బక్రీద్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ సూచించారు. చేర్యాల సర్కిల్ కార్యాలయంలో శనివారం ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడ్లారు. కుల, మతబేధం లేకుండా సోదరభావంతో మెదలుతూ ఒకరి పండుగలు, సంప్రదాయాలను మరొకరు గౌరవించాలని సూచించారు. గోవధ చేయకూడదని, ఎలాంటి ఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంతంగా బక్రీద్ వేడుకలను నిర్వహించుకోవాలని చెప్పారు. సమావేశంలో చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ దామోదర్ పాల్గొన్నారు. కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన నేపథ్యంలో హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ శనివారం విచారణ చేపట్టారు. ఇటీవల కోడి ఎరువు విక్రయ విషయంలో రసూలాబాద్‌కు చెందిన ఎర్రోళ్ల వెంకటేశం, ప్రవీణ్ అతడి బావమరిది గొడవపడ్డారు. ఈవిషయమై ప్రవీణ్ తదితరులపై ఎర్రోళ్ల వెంకటేశం కొమురవెల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. దీంతో ఏసీపీ సతీశ్ గ్రామంలో ఆరా తీశారు. ఆయనవెంట సీఐ శ్రీను, సిబ్బంది ఉన్నారు.

పొరపాట్లను సరిచేసుకోవాలి

● అదనపు డీఆర్డీవో పి.బాలక్రిష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ

నంగునూరు, జూన్ 15: ఉపాధిహామీ పనుల్లో చేస్తున్న పొరపాట్లను సరిచేసుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలని అదనపు డీఆర్డీడీఓ పి.బాలక్రిష్ణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ, ప్రజా వేదికను ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులపై బీఆర్పీలు నివేదికలను చదివి వినిపించారు. ఈజీఎస్ పథకంలో మొక్కలు ఎండిపోతున్నాయని, మస్టర్లు సరిగా రాయడం లేదని, జరిగిన పొరపాట్లను గుర్తించి, సంబంధిత పనులు చేయించిన వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. పనుల్లో చాలా వరకు అవకతవకలు జరిగాయని మరోసారి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పని ప్రదేశాల్లో సరైన వసతులు ఎందుకు కల్పించలేదని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లను ఏపీడీ ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ కూలీలకు సామగ్రి రాలేదని ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. ఈ ప్రజా వేదిక లో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి,ఏపీడీ శివాజీ, అడిషనల్ జిల్లా విజిలెన్స్ అధికారి వి.ప్రభాకర్, ఎస్ఆర్పీలు రవి,జీవన్, ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్, ఇంచార్జి ఏపీఓ వి.ప్రభాకర్ రావు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శ్రీనివాస్, పీఆర్ ఏఈ శశాంక్ గణేశ్, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు , బీఆర్పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం చేయించిన మునిసిపల్ చైర్‌పర్సన్

హుస్నాబాద్ టౌన్/మర్కుక్, జూన్ 15: హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు సుశిక్షితులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఆయిలేని అనిత, పాఠశాల హెచ్ఎం లావుడ్య లింగ్యానాయక్, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, శీలం సంధ్య, యాదయ్య, రవీందర్ తదితరులున్నారు. మర్కుక్ మండలంలోని చేబర్తిలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సారథి ఫౌండేషన్ చైర్మన్ గుండాల శేఖర్‌గుప్తా ఆధ్వర్యంలో విద్యార్థులకు పలుకలు, బలుపాలు, బిస్కెట్స్ అందజేశారు.



హుస్నాబాద్ టౌన్: విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

కార్యక్రమంలో కార్యదర్శి సిద్దేశ్వర్, జర్నలిస్ట్ జాలని యాదగిరి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అఖిల, ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి, సుదీష్ణ, స్వాతి, జ్యోతి, అంగన్వాడి టీచర్లు రాణి, స్వప్న పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● ఎంపీపీ అనసూయ కనక రాములు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు



కొండపాకలో మాట్లాడుతున్న ఎంపీపీ

కొండపాక, జూన్ 15: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రాలను పంపిణీ చేయాలని ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. కొండపాక ఐకేసీలో శనివారం నులిపురుగుల నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 20న నిర్వహించే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వైస్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఎంపీటీసీలు యాదగిరి, అంజనేయులు, పీహెచ్‌సీ వైద్యుడు శ్రీధర్, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● **మద్దూరు:** మద్దూరు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం ఏఎన్ఎం, ఆశాలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రజిత మాట్లాడారు. నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎస్ హేమలత, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** నులిపురుగు నివారణ మాత్రల పంపిణీకి మండలంలోని ప్రజాప్రతినిధులంతా సహకరించాలని మిరుదొడ్డి పీహెచ్‌సీ వైద్యురాలు సమీనా సుల్తానా కోరారు. మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో శనివారం జరిపిన ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్నారులకు నులిపురుగులతో ఎంతో ప్రమాదం ఉంటుందన్నారు. వాటిని నివారించేందుకు ఈనెల 20 నుంచి నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సుకురి లక్ష్మీలింగం, ఎంపీపీ ఉపాధ్యాక్షులు పోలీసురాజులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఎంపీపీ ఆర్థిక సహాయం

చేర్యాల, జూన్ 15: చేర్యాల మండలం ముస్త్యాలకు చెందిన మేరిండ్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. చేర్యాల ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్ శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనవెంట సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, నాయకులు శివగారి అంజయ్య, జగన్, కొంగరి గిరిధర్, సాయి, పరుశురాములు ఉన్నారు. అంతకుముందు సీపీఎం తరఫున ఆపార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, రేపాకకుమార్, గుండ్ర రవీందర్, ఏజాస్ తదితరులు క్వింటా బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిన్నకోడూరు, జూన్ 15: మండలంలోని రామునిపట్ల గ్రామ అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నలవాల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా కట్కూరి మహేందర్, మిట్టపల్లి పరశురాములు, ప్రధాన కార్యదర్శిగా పోతరాజు ప్రవీణ్, కార్యదర్శులుగా లింగపల్లి కిషన్, బెజ్జంకి రాజు, కోశాధికారిగా వెంకటాపురం సురేష్, సంయుక్త కార్యదర్శిగా రడం కనకయ్య, ప్రచార కార్యదర్శిగా పోతరాజు వంశీకృష్ణ తదితరులు ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ అంతరాయం

గజ్వేల్, జూన్ 15: గజ్వేల్ పట్టణంలోని ఆయా ఏరియాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గజ్వేల్ విద్యుత్ శాఖ ఏఈ మారుతి తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మల తొలగింపు దృష్ట్యా పలు ప్రాంతాల్లో ఉదయం 6గంటల నుంచి 10గంటల మధ్య అరగంట నుంచి గంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. గజ్వేల్ పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు గమనించి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

నాలుగు రోజుల్లో సర్వే పూర్తిచేయాలి

● ఎంపీడీవో రామ్మోహన్



మిషన్‌భగీరథ కెనెక్షన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మద్దూరు, జూన్ 15: మండలంలో నిర్వహిస్తున్న మిషన్‌భగీరథ సర్వేను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. మండలంలోని లద్నూరులో నిర్వహిస్తున్న సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేసి రిపోర్టును అందించాలని సూచించారు. అనంతరం హరితహారంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. గుర్తించిన ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఫీల్డు అసిస్టెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామొయినుద్దీన్, సెక్రటరీ శ్రీనివాస్, ఎఫ్ఏ, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్

కొండపాక, జూన్ 15: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి శనివారం కలిశారు. ఉమ్మడి మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో మహిళా స్వయం సహకార సంఘాలకు అత్యధిక రుణాలు మంజూరు చేసినందుకు గానూ పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఉత్తమ డీసీసీబీ అవార్డును చిట్టి దేవేందర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం జిల్లా మంత్రి అయినా దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో శ్రీనివాస్ ఉన్నారు.

అందుబాటులో ఆయుర్వేదిక్ మందులు

● ఆయుర్వేదిక్ మెడికల్ అధికారి దీపాంజలి

జగదేవ్‌పూర్, జూన్ 15: సీజనల్ వ్యాధులకు ఆయుర్వేదిక మందులు అందుబాటులో ఉన్నాయని ఆయుర్వేదిక్ మెడికల్ అధికారి దీపాంజలి తెలిపారు. మండలంలోని ఇటిక్యాల ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అనేక రకాల వ్యాధులకు ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో మందులు అందుబాటులో ఉన్నాయని, వర్షాకాలంలో వచ్చే ప్రత్యేకమైన వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇళ్ల వద్ద పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, వర్షాకాలంలో పారిశుద్ధ్యం పాటించకపోతే ఈగలు, దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధుల బారినపడతారన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుస్నాబాద్ రూరల్, జూన్ 15: హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్, గాంధీనగర్, మీర్జాపూర్ గ్రామాలల్లో శనివారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ లకావత్ మానస పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'సద్గురు మధుసూదన సాయి సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకం'



విద్యార్థినికి కిట్‌ను అందజేస్తున్న అతిథులు

కొండపాక, జూన్ 15: సమాజంలో నైతిక విలువలు పతనం అవుతున్న తరుణంలో విద్యార్థినులకు విలువలతో కూడిన విద్యను అందించి, ఉన్నత విలువలను కాపాడి భవిష్యత్ తరానికి అలవర్చే విధంగా సద్గురు మధుసూదనా సాయి చేస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమని సిద్దిపేట జిల్లా సాఫ్టబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, సిద్దిపేట రామరాజు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి నేతి కైలాసం, విస్తరాకు పరిశ్రమ నిర్వాహకులు వేణుగోపాల్, మాధవీలు అన్నారు. శనివారం కొండపాకలో ఉన్న శ్రీ సత్య సాయి ప్రశాంతి నికేతనం మహిళా కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వీరు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. 110 మంది విద్యార్థులకు (యూనిఫామ్స్, బ్లాంకెట్స్, స్వెటర్, షూస్, రోజువారి దుస్తులు, నిత్యవసర వస్తువులు) కిట్‌ను వారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధికారులు, సిబ్బంది తరితరులు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించాలి'



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు


గజ్వేల్, జూన్ 15: ధరణి పోర్టల్‌లో అపరిష్కృతమైన భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని, భూ రికార్డులను సరిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ గజ్వేల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో బన్సీలాల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. భూములను ఇతరుల పేర్ల మీద నమోదు చేశారని, పహణిలో తప్పుగా నమోదు చేయడం వల్ల తమ పూర్వీకుల నుంచి వ్యవసాయం చేసుకుంటూ వస్తున్న ఎందరో నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే ధరణిలో మార్పులు చేసి, భూసమస్యలు సులభంగా పరిష్కారమైయేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, ఎండీ. అహ్మద్, నర్సింహులు, రాజు, వెంకటరాముడు, వెంకటాచారి తదితరులున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

● మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి

నంగునూరు,జూన్ 15: మండలంలోని అక్కెనపల్లి ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి శనివారం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలలో గ్రామాల నుంచి వచ్చే పేద విద్యార్థులే చదువుతున్నారని తెలిపారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో చాలామంది విద్యార్థులు ఆదర్శ పాఠశాల విద్యకు దూరమవుతున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి రెండు బస్సులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

'విశ్వకర్మ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

హుస్నాబాద్, జూన్ 15: విశ్వకర్మలకు ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, దీనిని పరిశ్రమ శాఖకు మార్చి విశ్వకర్మ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విశ్వకర్మ పరిషత్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ కోరారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన ఏడు మండలాల విశ్వకర్మ పరిషత్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసి, తెలంగాణ జాతిపితగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ పరిషత్ నాయకులు ఎగ్గోజు సుదర్శనచారి, ఉప్పల

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు




రామునిబండ ఆలయం

జగదేవ్‌పూర్, జూన్ 15: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఆలయం(రామునిబండ రామాలయం) వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అయింది. ఎంతో చరిత్ర కలిగిన ఆలయం ఇటీవల దాతల సహకారంతో పునరుద్ధరణ చేపట్టారు. శనివారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు వేద పండితులు అంకురార్పణ చేశారు. నాలుగు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని ఆలయ పండితులు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ పండితులు కోరారు.

నేడు టీపీటీఎఫ్ విద్యా సదస్సు

జగదేవ్‌పూర్, జూన్ 15: టీపీటీఎఫ్ గజ్వేల్‌జోన్ ఆధ్వర్యంలో నేడు జరిగే విద్యా సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో టీపీటీఎఫ్ అధికారిక మాసపత్రిక ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకుడు ప్రకాష్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా సదస్సులో 'సంక్షేమంలో సామాజిక విలువలు' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాసిం, విద్యారంగ సంక్షోభం కర్తవ్యాలు అనే అంశంపై ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. నరసింహారెడ్డి, ఆటపాట, మాట అనే అంశంపై అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క వక్తలుగా ప్రసంగిస్తారన్నారు.

'చిన్నారిపై హత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి'



మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్, జూన్ 15: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో చిన్నారిపై హత్యాచారం చేసిన వ్యక్తిని పోక్సో చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. అభంశుభం తెలియని ఆరేళ్ల చిన్నారిని అపహరించి అత్యాచారం చేసిన హత్య చేసిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నాయకులు మాసాన్‌పల్లి మైసయ్య, క్యాసారం కృష్ణ తదితరులున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

హుస్నాబాద్, జూన్ 15: హైదరాబాద్‌లోని ఓ తండాలో గిరిజన బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు రాజునాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. వారం రోజుల క్రితం బాలిక తప్పిపోగా పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో హత్యాచారానికి గురైందని ఆరోపించారు.

కేసీఆర్‌ను విమర్శించే హక్కులేదు

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 15: గజ్వేల్ బీజేపీ వెదవలకు కేసీఆర్‌ను విమర్శించే హక్కు లేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కుల, మతాల పేరుతో ఓట్లను బిచ్చగాళ్ల మాదిరిగా అడుగుతూ, రాజకీయ లబ్ధి పొందుతున్న ఏకైక పార్టీ బీజేపీ అని విమర్శించారు. కులమతాల పేరుతో కేంద్రంలోని మోదీ సర్కార్ రాజకీయ లబ్ధిని పొందుతున్నదని, దేశంలోని ప్రజలు బీజేపీని చీకొట్టడంతో ప్రాంతీయ పార్టీలపై ఆధారపడవలసిన దుస్థితి దాపురించిదన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఏ రంగంలో కూడా ఉద్యోగాలను కల్పించలేదని విమర్శించారు. దేశంలోని అన్ని రంగాలను ప్రైవేటుపరం చేస్తూ అదానీ, అంబానీ గ్రూపులకు దేశాన్ని తాకట్టు పెట్టే పరిస్థితి తెచ్చిపెడుతున్నారన్నారు. కొందరు స్థానికంగా ఉండే బీజేపీ వెదవలు కేసీఆర్‌పై చేస్తున్న విమర్శలను మానుకోవాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ మార్క్ అభివృద్ధి ఉందని, బీజేపీ వెదవలకు అది అర్థం కావడం లేదన్నారు. పది సంవత్సరాల కేసీఆర్ హయాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కేసీఆర్ అభివృద్ధి చేసిన విధంగా బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలు చేసే దమ్ము, ధైర్యం బీజేపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు.

హరీశ్‌రావును విమర్శించే అర్హత లేదు

● బీఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొండం సంపత్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, జూన్ 15: శ్రీరాముని పేరు చెప్పుకుని, అక్షింతలు పంచి గెలిచిన రఘునందన్‌రావుకు బీఆర్ఎస్‌ను, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే అర్హత లేదని ఆ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు బీజేపీ గెలుపు కోసం పనిచేశారని రఘునందన్‌రావు వాఖ్యానించడం ఆయన మూర్ఖత్వమన్నారు. బీఆర్ఎస్ ఓడింది బీజేపీ, ప్రధాని మోదీ లాంటి వ్యక్తులతో కాదని, శ్రీరాముని చేతిలో ఓడిపోయిందని తెలిపారు. బీజేపీకి ఓటు వేస్తే శ్రీరామునికి ఓటు వేసినట్లే అని చెప్పి రఘునందన్‌రావు గెలిచాడని తెలిపారు. దుబ్బాక ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం వల్లే అక్కడ ప్రోటోకాల్ లేకుండా పోయిందని, సిద్దిపేట ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రఘునందన్‌రావుకు ఇక్కడ కూడా ప్రోటోకాల్ లేకుండా చేస్తామని హెచ్చరించారు. ఒక కలెక్టర్‌గా ప్రాజెక్టుల కోసం భూమి సేకరిస్తే అది వెంకట్రామారెడ్డి తన సొంతానికి తీసుకున్నట్లుగా రఘునందన్‌రావు ఆరోపించడం తన అవివేకమని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు కనకరాజు, మహేష్, నరసింహులు, రమేష్, మధు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో గ్రామస్థుల బెంబేలు

మద్దూరు, జూన్ 15: మండలంలో వరుస దొంగతనాలతో గ్రామస్థులు బెంబేలెత్తున్నారు. దూళిమిట్ట మండలం కొండాపూర్‌లో శుక్రవారం రాత్రి ఇంటి ముందు నిలిపిన తన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు బాధితుడు కౌడికాయల రాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల వల్లంపట్ల గ్రామంలో ఓ రైతు మోపెడ్ చోరీకి గురైంది. కొద్ది రోజుల తరువాత మరో రైతుకు చెందిన పత్తిదున్నే టిల్లర్ చోరీకి గురైయింది.

విద్యుత్ స్తంభం మీద పడి పాడిగేదే మృతి

హుస్నాబాద్, జూన్ 15 : విద్యుత్ స్తంభం మీద పడడంతో విద్యుదాఘాతానికి గురై పాడి గేదే మృతిచెందింది. గూళ్ల మధుకర్ అనే రైతుకు చెందిన పాడి గేదేను హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులోని వ్యవసాయ పొలం వద్ద మేత మేపేందుకు కట్టేశాడు. ఏళ్లనాటి విద్యుత్ స్తంభం కావడంతో పాడి గేదే దానికి తగలడంతో విరిగి మీద పడిందని, విద్యుదాఘాతానికి గురై గేదే మృతిచెందిదని బాధిత రైతు వాపోయాడు. దాదాపు రూ. 90 వేలు నష్టపోయానని, ఎక్స్‌గ్రేషియా చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

సమీకృత మార్కెట్‌లో నిలిపిన ఆటో మాయం

గజ్వేల్, జూన్ 15: గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్‌లో పెట్టిన ఆటో అదృశ్యమైంది. గజ్వేల్ మండలం కోమటిబండకు చెందిన సాకలి దశరథం గత నెల 25న గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్‌లో ఆటో పెట్టి యాదాద్రి-భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రికి పని నిమిత్తం వెళ్లి, శనివారం ఉదయం తిరిగివచ్చి చూసేసరికి ఆటో లేకపోవడంతో దశరథం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.